క్లుప్తంగా

ఐసీఏఐ ఆధ్వర్యంలో చార్టర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీనివాసరావుతోటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) గుంటూరు చాప్టర్ కార్యాలయంలో శనివారం 77వ చార్టర్డ్ అకౌంటెంట్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా సీఏలతోపాటు సీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థులతో రమేష్ హాస్పిటల్స్ నుంచి ఐసీఏఐ గుంటూరు చాప్టర్ కార్యాలయం వరకు వాకథాన్ నిర్వహించారు. గుంటూరు చాప్టర్ చైర్మన్ చింతా వీఎస్ఎస్ రఘునందన్, కార్యదర్శి వనిమిరెడ్డి వెంకట నరేష్, కోశాధికారి కన్నెగంటి మృత్యుంజయరావు, సభ్యులు షేక్ బాజీ, దేసు సంపత్, పలువురు సీఏలతో కలసి స్వచ్ఛభారత్ అభియాన్ పచ్చదనం–పరిశుభ్రత నినాదంతో మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఏలు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఐసీఏఐ భవన్ పరిసరాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించారు.

పాఠశాలల బస్సులు నిబంధనలు పాటించాలి

పట్నంబజారు: పరిమితికి మించి కళాశాల, స్కూల్ బస్సుల్లో విద్యార్థులను అనుమతిస్తే చర్యలు తీసుకుంటామని పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ హెచ్చరించారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తోపాటు, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో రోడెక్కే ప్రతి పాఠశాల బస్సులు నిబంధనలకు లోబడి ప్రయాణించాలని సూచించారు. తనిఖీలు నిర్వహించే సమయంలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సరిగా లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం



నెహ్రూనగర్: గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్క్వాడ్ సీఐ బి.నయనతార శనివారం అరెస్టు చేశారు. వివరాలు.. స్తంభాల గరువుకు చెందిన అక్కిగోపి, 200 గ్రాముల గంజాయి కలిగి ఉన్నడనే సమాచారంతో అతడిని అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకుని గుంటూరు 2 ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు.

పోలీస్ శాఖకు కారు బహూకరణ



నగరంపాలెం: పోలీస్ శాఖకు కారు అప్పగించడం ఆనందాయకమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. చలపతి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు రూ.10.50 లక్షల ఖరీదైన కారుని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు అందించారు. కారు తాళాలు, పత్రాలను జిల్లా ఎస్పీకి అప్పగించారు. కార్యక్రమంలో తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, తాడికొండ పీఎస్ సీఐ వాసు, చలపతి మోతడక ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా నాగశ్రీనివాసరావు, జిల్లా ఏఎస్పీ(ఏఆర్) హనుమంతు, ఆర్ఐ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కులు అందజేత

నగరంపాలెం: గత రెండు నెలలు క్రితం ఏఆర్ కానిస్టేబుళ్లు జి.వీరయ్య, కె.క్రాంతికుమార్ వేర్వేరు కారణాలతో మృతిచెందారు. ఈ మేరకు వీరయ్య భార్య సౌజన్యలక్ష్మి, క్రాంతికుమార్ భార్య ప్రవీణకు ఒక్కొక్క లక్ష చొప్పున చెక్కులను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు. పోలీస్ కుటుంబ సభ్యులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ అద్దంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కొరిటిపాడు: గుంటూరు సర్కిల్ పరిధిలో ఈనెల 29న విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ సీహెచ్ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో కౌంటర్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. మొబైల్‌ఫోన్లల్లో ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్, ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని వివరించారు. అవకాశాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ సీపీ విజయమే మన లక్ష్యం

పార్టీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ సమన్వయకర్త అంబటి రాంబాబు



అంబటి రాంబాబును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



అంబటి రాంబాబును అభినందిస్తున్న పోతిన మహేష్

పట్నంబజారు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని గెలుచుకోవడమే మన లక్ష్యం అని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు పేర్కొన్నారు. శ్రీనివాసరావుపేటలోని ఏ1 కన్వెన్షన్ హాలులో శనివారం పశ్చిమ నియోజకవర్గ నేతలు, కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ, 2024 ఎన్నికల్లో ఈవీఎంల మాయతో గెలిచారనే ప్రచారం జరుగుతోందని చెప్పారు. పశ్చిమ నుంచి పోటీ చేయనున్న తనకు ప్రజల ఆశీస్సులు కావాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు వచ్చి సింగయ్య అనే పార్టీ కార్యకర్త చనిపోతే దానిని రాజకీయం చేశారని, సింగయ్య ఏ కారు కింద పడి మరణించిన పార్టీ కార్యకర్తగా ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మరి కొద్ది రోజుల్లో బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ అనే కార్యక్రమం ప్రారంభం అవుతుందని, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పర్యటించి, వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన సంక్షేమాన్ని, కూటమి ఏడాది పాలనలో జరిగిన పరిస్థితులను వివరిస్తారన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న పార్టీ కార్పొరేటర్లతో సమీక్షించి, పదవులు కల్పించి, భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు.

■ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ ఐదేళ్ల సువర్ణ పాలన చూసిన ప్రజలు, కూటమి పాలనలో విసిగిపోయారని చెప్పారు. సుదీర్ఘ అనుభవం కలిగిన అంబటి రాంబాబును పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించటం సంతోషదాయకమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యేగా పనిచేయించుకునేందుకు ఆయన్ని వైఎస్ జగన్ నియమించారని, అఖండమైన మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు.

■ పార్టీ గుంటూరు, పల్నాడు, కృష్ణా జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ పునర్వైభవం తీసుకుని వచ్చిన ప్రతి కార్యకర్తకి మేలు జరుగుతుందన్నారు. సీఎం హోదాలో చంద్రబాబు గుంటూరుకు వస్తే.. వంద మంది లేరని, ప్రజల్లో వారికి ఉన్న విలువ ఏంటో అర్థమవుతోందని చెప్పారు. పవన్‌కళ్యాణ్ డెప్యూటీ సీఎం అయ్యాక కేవలం చంద్రబాబు అభిమానం మాత్రమే సంపాదించుకున్నారని, ప్రజలు, అభిమానుల అభిమానాన్ని కోల్పోయారన్నారు.

■ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు.

■ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ గత ఎన్నికల తరువాత పార్టీని జిల్లాలో బలోపేతం చేసి అంబటి తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడారు. అనంతరం పశ్చిమ నియోకజవర్గ సమన్వయకర్తగా నియమితులైన అంబటిని పార్టీ నేతలు, కార్యకర్తలు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. పార్టీ జిల్లా పరిశీలకులు పోతిన మహేష్, అంబటిని సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పోలూరి వెంకటరెడ్డి, సీడీ భగవాన్, మామిడి రాము, కళ్లం హరికృష్ణారెడ్డి, నందేటి రాజేష్, బత్తుల దేవా, సీహెచ్ వినోద్, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, పఠాన్ సైదాఖాన్ పాల్గొన్నారు.

1989 నుంచి రాజకీయాల్లో ఉన్నా.. రేపల్లెలో ప్రారంభమైన నా ప్రస్థానం.. అనేక మజిలీలు. ఒడిదొడుకులు మధ్య వరకు వచ్చింది.. నా చివరి మజిలీ గుంటూరు.. 70 ఏళ్లకు చేరువలో ఉన్నా. నా చివరి మజిలీని భగవంతుడు, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గుంటూరు సేవకు అవకాశం కల్పించారని రాంబాబు ఉద్వేగభరితంగా ప్రసంగించారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

జూలై 9 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణ మూర్తి పిలుపు నిచ్చారు. కొత్తపేట సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మికుల పని గంటల పెంపుదలను 8 గంటల నుంచి 10 గంటలకు పెంచడంపై ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ సమ్మె జయప్రదానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, నాయకులు చల్లచిన ఆంజనేయులు, పుప్పాల సత్యనారాయణ, కోట మాల్యాద్రి, చిన్ని సత్యనారాయణ, రావుల అంజిబాబు, సురేష్, మంగ శ్రీనివాసు, ఆరేటి రామారావు, రాజు, మీరావలి పాల్గొన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

పట్నంబజారు: నగరంలోని లాలాపేట వేంకటేశ్వర స్వామి గ్రూపు ఆలయాల హుండీ కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సిరాజుద్దీన్, శ్రీకృష్ణ యాదవ్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ బధిరుల దినోత్సవం సందర్భంగా అన్నందానం, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సంఘ మిత్ర మొహమ్మద్ సిరాజుద్దీన్ సహకారంతో వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్, శ్రీకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు రూరల్ నాయుడుపేట డంపింగ్ యార్డు ప్రాంతంలో నివసిస్తున్న నిరుపేదలకు మధ్యాహ్న భోజనంతో పాటు వారి పిల్లలకు విద్య ఉపకరణాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు 'సంఘ మిత్ర' మొహమ్మద్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ ఆ ప్రాంత ప్రజల అవసరాల కోసం రూ.ఐదు లక్షలతో ఒక ఆడిటోరియం నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ మాట్లాడుతూ చూపు లేకపోయినా, మాట వినికిడి లోపం ఉన్నా, ప్రపంచంలో మొట్టమొదటి గ్రాడ్యుయేట్‌గా పేరు పొంది, బధిర దివ్యాంగుల సంక్షేమం కోసం తనజీవితాన్ని అంకితం చేసిన హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా జూన్ 27న బధిర వికలాంగుల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. అనంతరం అక్కడి ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాశం సర్దార్ అభినంద్ యాదవ్, కుర్రా శ్రీనివాస్ యాదవ్, కోనంకి మురళీ కృష్ణ యాదవ్, కె.బాలరాజు, బొద్దుపల్లి కోటేశ్వరరావు, జీవన్, ఉప్పలపాటి భాస్కర్, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్



పట్నంబజారు: రౌడీషీటర్లు ఇష్టానుసారంగా వ్యవహరించి నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ హెచ్చరించారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో శనివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ నేర ప్రవృత్తిని మానుకొని సమాజ హితం కోసం రౌడీషీటర్లు కృషి చేయాలన్నారు. సివిల్ పంచాయితీలు, ఇతరత్ర నేరాల్లో పాల్గొంటే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రౌడీ మూకలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమన్నారు. కౌన్సెలింగ్‌లో లాలాపేట సీఐ శివప్రసాద్, ఎస్ఐలు షేక్ హసీం, ప్రవీణ, విజయకుమార్, బాలానాయక్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సేవలు ఆదర్శనీయం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తూ ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్న బీసీ ఉద్యోగులకు యూనివర్సిటీ బీసీ ఉద్యోగ సంఘ నాయకులు శనివారం పూలే అధ్యయన కేంద్రంలో పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఎం.త్రిమూర్తి రావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరయ్య మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బీసీ ఉద్యోగులు పలు హోదాల్లో విధులు అందరి మన్ననలు పొందారన్నారు. వీరి సేవలను యూనివర్సిటీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని చెప్పారు. త్రిమూర్తిరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ బీసీ ఉద్యోగులు విధులు నిర్వహణ, బీసీ ఉద్యోగ సంఘం బలోపేతానికి ప్రత్యేక కృషి చేశారన్నారు. బీసీ వర్గాల హక్కుల కోసం ముందుండి పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఎన్.వెంకటేశ్వరరావు, బీసీ ఉద్యోగ సంఘ నాయకులు సిహెచ్.సాంబశివరావు ఐ.సాయిరాం, పరీక్షల విభాగం నోడల్ ఆఫీసర్ ఆర్.ప్రకాశరావు, భాను ప్రకాష్, సూర్య కామేశ్వరి, ఏఆర్ కాశయ్య, ఎన్.శ్రీనివాసరావు, షకీలా బేగం, విష్ణు, బి.కోటి యాదవ్ పాల్గొన్నారు.

మానసిక వ్యాధులు పెరిగిపోతున్నాయి..

- ప్రిన్సిపాల్ ఎన్.వి.సుందరాచారి
- వైద్య కళాశాలలో ఐసీడీ వర్క్ షాపు



వర్క్‌షాపును ప్రారంభిస్తున్న డాక్టర్ సుందరాచారి, పక్కన డాక్టర్ ఉమాజ్యోతి, డాక్టర్ ఫణిభూషణ్

గుంటూరు మెడికల్: మానసిక వ్యాధులు నానాటికి పెరిగిపోతున్నాయని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో శనివారం జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగం, మానసిక వ్యాధి నిపుణుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ క్లాసిఫికేషన్ ఆఫ్ డిసీజెస్(ఐసీడీ–11) వర్క్‌షాపు నిర్వహించారు. వర్క్‌షాపును ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ ఆధునిక జీవన శైలి వల్ల ప్రతి ఒక్కరూ ఏదో ఒక మానసిక వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ మానసిక వ్యాధులపై అవగాహన కలిగి ఉండి, త్వరగా చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధుల నుండి బయటపడవచ్చు అన్నారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు చాలా మంది చేస్తున్నారని, వీరందరికి మానసిక వ్యాధి నిపుణుల అవసరం చాలా ఉందని అభిప్రాయపడ్డారు. పలు డిపార్ట్‌మెంట్‌లలో చాలా మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, వీరికి కౌన్సెలింగ్ అవసరం ఉందన్నారు. మానసిక వ్యాధుల విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతి మాట్లాడుతూ తెలుగు రెండు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా ఐసీడీ వర్క్‌షాపు గుంటూరులో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆదివారం కూడా వర్క్‌షాపు ఉంటుందని వెల్లడించారు. కర్ణాటక మణిపాల్ హాస్పిటల్ వైద్యులు సమీర్, రాజేష్ కృష్ణ, రవీంద్ర, సుమ అవగాహన కల్పించారు. మానసిక వ్యాధి నిపుణుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకుడు డాక్టర్ కోటా సురేష్ కుమార్, జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ద్రోణంరాజు ఫణిభూషణ్ హాజరయ్యారు.

మహిళపై కత్తితో దాడి

లక్ష్మీపురం: సహజీవనం చేస్తున్న మహిళపై దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. అడవితక్కెళ్లపాడు టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉంటున్న రెబ్కా అనే మహిళ మోషె సహజీవనం చేస్తున్నారు. వీరికి గతంలో వేరేవారితో వివాహాలు జరిగాయి. మోషెకు భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. రెబ్కాకు ఇరువురు సంతానం ఉన్నారు. రెబ్కా భర్తను వదిలేసి మోషెతో సహజీవనం చేస్తోంది. ఇద్దరు చీరాల మండలం నందికొండపాలేనికి చెందిన వారు. వీరివురు మధ్య స్నేహంతో గుంటూరులోని అడవితక్కెళ్లపాడులో నివాసం ఉంటున్నారు. రూ.4 లక్షలు అప్పులు చేశారు. ఈ అప్పులు తీర్చలేక ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగుతోంది. రెబ్కాకు మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఉందంటూ అనుమానిస్తూ గొడవ పడుతున్నాడు. దీంతో భయపడిన రెబ్కా వేరే ప్రాంతంలో నివాసం ఉంటుంది. శనివారం మోషె జేకేసీ కళాశాల వద్దకు రావాలని రెబ్కాకు చెప్పాడు. దీంతో అక్కడకు రెబ్కా రాగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. రెబ్కాకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులిని జీజీహెచ్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చరిత్ర సృష్టించిన భారత వ్యోమగామి శుభాంశు

లక్ష్మీపురం: భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్షంలో అడుగు పెట్టడం దేశానికి గర్వకారణమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. సమావేశంలో విశ్లేషకులు వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు మాట్లాడారు.

వైద్య కళాశాలలో పేరెంట్స్ వెయిటింగ్ హాల్ ప్రారంభం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు చేస్తున్న సాయం ఎంతో అభినందనీయమని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి అన్నారు. వైద్య కళాశాల 1992 బ్యాచ్ విద్యార్థినులు వైద్య కళాశాల మహిళ వసతి గృహంలో పేరెంట్స్ వెయిటింగ్ హాలు ఆధునికీకరణకు రూ.9 లక్షల విరాళం అందజేశారు. ఆధునికీకరించిన హాలును శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రూ.4 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు నగరానికి చెందిన పలువురు దాతల సహాయంతో ఏడు నెలల్లో వైద్య కళాశాలల్లో కార్పొరేట్ కళాశాలల కంటే ధీటుగా వసతులు సమకూర్చి వైద్య విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్యను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, విరాళం అందజేసిన డాక్టర్ బి.వి.శివమ్మ, డెప్యూటీ వార్డెన్ డాక్టర్ వై.సౌజన్య, విరాళం అందజేసిన డాక్టర్ వి.సునీత, డాక్టర్ ఎ.లక్ష్మీమమత, డాక్టర్ రాధాలక్ష్మి, డాక్టర్ కె.రాధిక, డాక్టర్ వెంకటరమణకుమారి, డాక్టర్ బి.మమత, డాక్టర్ సి.హెచ్.శాలిని, డాక్టర్ విజయశ్రీ పాల్గొన్నారు.

గుర్తింపు లేని కళాశాల ఎదుట ధర్నా



లక్ష్మీపురం: గుర్తింపు లేని ఆక్స్‌ఫర్డ్ జూనియన్ కళాశాలలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండు శివ, బందారపు యశ్వంత్ డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని చంద్రమౌళి నగర్‌లోనిల జూనియర్ కళాశాల వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ బోర్డు రూల్స్‌కి వ్యతిరేకంగా ఎటువంటి ఇంటర్ బోర్డు అనుమతులు లేకుండా కళాశాల నడుపుతున్నారని ఆరోపించారు. అలానే గుర్తింపు లేని ప్రైవేట్ కళాశాల వారు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా పాఠ్య పుస్తకాలను 8 పుస్తకాలు రూ.12,000, రూ.15,000 లకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. తక్షణమే ఆర్ఐఓ గర్నెపూడి సునీత, స్పందించి అక్రమంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం అని విద్యార్థి సంఘాలకు హామీ ఇచ్చారు.

బిడ్డలకు కౌన్సెలింగ్ కష్టాలు



కౌన్సెలింగ్‌కు మహిళా ఉద్యోగి వెళ్లడంతో బయట చిన్నారిని ఆడిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 14 యూఎల్‌బీలకు సంబంధించిన సచివాలయ సెక్రటరీలకు బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో చేపట్టారు. కౌన్సెలింగ్‌కు నెలల చిన్నారులను తీసుకువచ్చి తల్లులు అవస్థలు పడ్డారు. వారికి సరైన వసతి లేకపోవడంతో చెట్లు కింద ఊయల ఏర్పాటు చేసుకుని, మహిళా ఉద్యోగినుల భర్త, వారి కుటుంబ సభ్యులు చిన్నారులను పట్టుకుంటే వారి తల్లులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు.




విజ్ఞాన మందిరం బయట నెలల చిన్నారి ఆలన పాలన చూసుకుంటున్న ఉద్యోగిని బంధువు



చెట్టుకి ఊయ్యల కట్టి పాపను ఊపుతున్న మహిళా ఉద్యోగి

అంధకారంలో నగరం

- కార్మికుల వినూత్న నిరసన
- వీధి లైట్లు వెలిగించని సిబ్బంది



వీధి లైట్లు వెలిగించకపోవడంతో అంధకారంగా మారిన ఓ వీధి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచడంతో, ఇతర పలు సమస్యలను పరిష్కారించాలని ఈ నెల 23వ తేదీ నుంచి కార్మికులు విధులు బహిష్కరించి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. 27వ తేదీన మంగళగిరిలోని సీడీఎంఏ(కమిషనర్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసిన నేపథ్యంలో 28వ తేదీ సాయంత్రం లోపు ఉన్నతాధికారుల నుంచి సమస్యల పరిష్కారానికి ఎటువంటి పిలుపు రాకపోతే 28వ తేదీ సాయంత్రం నుంచి నగరంలో వీధి లైట్లు వేయకుండా చేస్తామని హెచ్చరించారు. నిరసనలో భాగంగానే శనివారం రాత్రి నగరంలో అవుట్ సోర్సింగ్ కార్మికులు వీధి లైట్లు వేయకుండా తమ నిరసన వ్యక్తం చేశారు. ఇంకా తమ సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ చైర్మన్ ఈదులమూడి మధుబాబు పేర్కొన్నారు.

వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

లక్ష్మీపురం: వివాహితను నిత్యం ఫోన్లు చేసి వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. సాకేతపురం ప్రాంతానికి చెందిన గుమ్మడి రాజశేఖర్, లక్ష్మి దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత కొన్ని నెలలుగా జి.ప్రవీణ్ తనను ప్రేమించాలంటూ ఫోన్‌లో లక్ష్మిని వేధింపులకు గురిచేస్తున్నాడు. ప్రేమించకపోతే చంపుతానని బెదిరించాడు. బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొంతు కోసుకున్న వ్యక్తి మృతి

లక్ష్మీపురం: భార్యపై అనుమానంతో భార్య లక్ష్మి(40) గొంతు కోసి హత్య చేసి, తన గొంతు కోసుకుని చికిత్స పొందుతున్న రాజు(45) శనివారం మృతి చెందాడు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. కన్నవారితోటకు లక్ష్మి, రాజు దంపతులకు ఇద్దరు సంతానం. లక్ష్మికి రెండో వివాహం. మొదటి భర్తతో విభేదాలతో వదిలేసి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కళాశాలలో వంట పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. అదే కళాశాలలో వంట పని చేసే రాజుతో పరిచయం అయింది. పరిచయం ప్రేమగా మారి ఇద్దరు వివాహం చేసుకుని గుంటూరు కన్నవారితోటలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో రాజు మద్యానికి బానిసయ్యాడు. భార్యపై అనుమానంతో నిత్యం వేధింపులు గురిచేస్తుండేవాడు. భార్య లక్ష్మిని రెండు నెలలుగా పనికి వెళ్లనీయలేదు. ఈనెల 21వ తేదీన ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహంతో భర్త రాజు, భార్య లక్ష్మిని హత్య చేశాడు. రాజు కూడా అదే కత్తితో గొంతు కోసుకుని రక్తపు మడుగులో పడి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రాజు శనివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు.